మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 07 సంచిక : 364 శనివారం 24 - 05 - 2025 పేజీలు: 8 వెల: 4

## వ్యాపారులకు సహకరిస్తాం



3లో..

## విద్యార్థులు కోటాలోనే ఎందుకు చనిపోతున్నారు..?

- రాజస్థాన్ ప్రభుత్వాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు




మన గళం, ఉన్నత చదువు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్ కోటాలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. ఒత్తిడి కారణంగా గత కొంతకాలంగా విద్యార్థులు తనువు చాలిస్తున్నారు. వసతి గృహాల్లోని ఫ్యాన్లకు ఉరివేసుకోవడం,

2

## కేంద్రమంత్రి జితేంద్ర సింగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ..

- ఏపీలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు సహకారంపై చర్చించారు
- ప్రాజెక్టు పనులను త్వరగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం చంద్రబాబు అభ్యర్థించారు
- ఈ ప్రతిపాదనలో రాష్ట్ర మద్దతుతో రెండు స్పేస్ సిటీల అభివృద్ధికి సంబంధించిన వివరాలున్నాయి





మన గళం, న్యూఢిల్లీ, : హస్తినలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. కేంద్ర మంత్రులతో చంద్రబాబు వరుసగా భేటీలు అవుతున్నారు. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, భూ విజ్ఞాన శాఖల మంత్రి జితేంద్ర సింగ్‌తో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అంతరిక్ష తయారీ, ఆవిష్కరణలకు కీలక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు కోరుతూ ఒక సమగ్ర ప్రతిపాదనను సీఎం సమర్పించారు. ఈ ప్రతిపాదనలో రాష్ట్ర మద్దతుతో రెండు స్పేస్ సిటీల అభివృద్ధికి సంబంధించిన వివరాలున్నాయి. వీటిలో ఒకటి ఇస్రో షార్ అంతరిక్ష కేంద్రం సమీపంలో, మరొకటి లేపాక్షి వద్ద ఉంటాయి. ఉపగ్రహాల ఉత్పత్తి, ప్రయోగ వాహనాల అభివృద్ధి, పరిశ్రమల సహకారానికి ఇవి సమగ్ర కేంద్రాలుగా ఉపయోగపడనున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అంతరిక్ష సాంకేతికత సలహాదారుగా ఇస్రో మాజీ ఛైర్మన్ డా.ఎస్. సోమనాథ్ నియామకం గురించి కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా తెలియజేశారు. ఆయన మార్గదర్శకత్వంలో అంతర్జాతీయంగా పోటీపడే అంతరిక్ష ఎకోసిస్టంను నిర్మించడంలో రాష్ట్ర ప్రయత్నాలకు ఈ నియామకం దిశానిర్దేశం చేస్తుందని వివరించారు. వ్యూహాత్మక స్థానం, పారిశ్రామిక బలం, భవిష్యత్తుకు సిద్ధమైన మౌలిక సదుపాయాలతో, భారతదేశ అంతరిక్ష రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ పూర్తిగా కట్టుబడి ఉందన్నారు.

2

## తల్లి మరణం.. పదవీ విరమణ రోజు..

- అయినా 11 తీర్పులిచ్చిన సుప్రీం జడ్జి ఓకా



మన గళం,జస్టిస్ ఓకా. అవును సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎఎస్ ఓకా చరిత్రనే మార్చారు. తన పదవీ విరమణ రోజు సాంప్రదాయాల్ని పక్కనపెట్టి పనే పరమావధి అని చేసి చూపించారు. ఎంతో ప్రేమ ఉన్న తన తల్లిని కోల్పోయి

2

## తెలంగాణలో దంచికొడుతున్న వానలు..

మన గళం, తెలంగాణవ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. ద్రోణి ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాగల రెండురోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయి. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని.. దాంతో పాటు కర్నాటక, తమిళనాడుతో పాటు దక్షిణ మధ్య ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఈ నెల 27న పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు



2

## ఆర్గానిక్ ఉత్పత్తులకు కొత్త ప్రపంచం..



మన గళం, న్యూఢిల్లీ,: దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు ఓ వైవిధ్యం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ వైవిధ్యమే

2

## బెయిల్ వచ్చిందని ర్యాలీ చేశారు..

- రేప్ కేసు నిందితులపై ప్రజల ఆగ్రహం..



మన గళం, రేప్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న యువకులకు కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. అయితే విడుదల అవగానే వారంతా బైకులు, కార్ల తో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బెయిల్ వచ్చిందని ర్యాలీ చేశారు.. రేప్ కేసు నిందితులపై ప్రజల ఆగ్రహం.. రేప్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న యువకులకు కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. అయితే విడుదల కాగానే ఆ యువకులంతా

2

## బెట్టింగ్ యాప్‌లపై 'సుప్రీం'లో కేఏ పాల్ పిటిషన్..


- విచారణ సమయంలో సచిన్ పేరు ప్రస్తావన..!



మన గళం, బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ నేత కేఏ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయంలో స్పందన చెప్పాలని కేంద్రానికి సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్ కారణంగా పిల్లలను కోల్పోయిన లక్షలాది మంది పిల్లల తరఫున కోర్టుకు వచ్చానని కేఏ పాల్ పేర్కొన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని.. లేకపోతే నియంత్రించాలని కేఏ పాల్ పిటిషన్‌లో కోరారు. ఈ యాప్‌ల ద్వారా

2

## కరోనా కలకలం.. ఏపీలో మరో కేసు



మన గళం, కడప, : ఏపీలో కరోనా కేసులు నమోదు కలకలం రేపుతోంది. కడపలో కరోనా పాజిటివ్ కేసు నమోదు అయ్యింది. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన 75 ఏళ్ల మహిళ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కడప రిమ్స్‌లో చేరింది. వృద్ధురాలికి తీవ్ర జ్వరం ఉండటంతో అనుమానించిన వైద్యులు గత రాత్రి కరోనా పరీక్షలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమెకు కరోనా సోకినట్లు రిమ్స్ వైద్యులు తేల్చారు. వృద్ధురాలికి వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. ఇక కడప జిల్లాలో మరోసారి మొదటిగా ఒక

2

## విద్యార్థులు కోటాలోనే ఎందుకు చనిపోతున్నారు..?

మొదటిపేజీ తరువాయి విషం తాగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఆత్మహత్యలను దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇది చాలా ఆందోళకరమైన విషయం అంటూ రాజస్థాన్ ప్రభుత్వంపై ఫైర్ అయ్యింది. విద్యార్థుల ఆత్మహత్యలు కోటాలో మాత్రమే ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించింది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని నిలదీశింది. వీటిని తేలికగా తీసుకోవద్దన్న ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ ఏడాది కోటాలో ఇప్పటి వరకూ 14 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న విషయం తెలిసిందే. విద్యార్థుల ఆత్మహత్యలపై నమోదైన పిటిషన్లపై న్యాయమూర్తులు జేబీ పార్దివాలా, ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ విచారణ చేపట్టింది. విద్యార్థుల మరణాలు చాలా తీవ్రమైన సమస్యగా అభివర్ణించింది. వీటిని తేలిగ్గా తీసుకోకూడదని పేర్కొంది. 'మీరు ఏం చేస్తున్నారు..? ఇంత మంది పిల్లలు కోటాలో మాత్రమే ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు..? దీని గురించి మీరు ఆలోచించలేదా..?' అంటూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదిని జస్టిస్ పార్దివాలా ప్రశ్నించారు. 'కోటాలో ఇప్పటి వరకూ ఎంత మంది యువ విద్యార్థులు మరణించారు..? విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు..?' అంటూ కోర్టు ప్రశ్నించింది.

## తల్లి మరణం.. పదవీ విరమణ రోజు..

మొదటిపేజీ తరువాయి ఒక్క రోజు కూడా గడవగముందే కోర్టుకు హాజరయ్యారు. అంతేకాదు, ఏకంగా చివరి రోజున 11 తీర్పులు ఇచ్చారు. "పదవీ విరమణ" అనే పదాన్ని తాను ద్వేషిస్తానని, చివరి రోజున పని చేయకపోవడం అనే సంప్రదాయంతో తాను ఏకీభవించనని ఓకా చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఓకా శనివారం (మే 24న) పదవీ విరమణ చేయబోతున్నారని బార్ అండ్ బెంచ్ ప్రకటించింది. దీనికి ముందు రోజు ముందు ఓకా తన తల్లి చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరు కావడానికి ముంబైకి బయలుదేరి వెళ్లారు. ఒక్క రోజులోనే ఢిల్లీకి తిరిగివచ్చి కోర్టుకు హాజరయ్యారు. పదవీ విరమణ రోజున పని చేయకూడదనే సంప్రదాయాన్ని పక్కనపెట్టి జస్టిస్ ఓకా తన సాధారణ బెంచ్‌లో భాగంగా 11 తీర్పులు వెలువరించారు. తర్వాత చీఫ్ జస్టిస్ బిఆర్ గవైతో కలిసి ఉత్సవ బెంచ్‌కి వెళ్లారు. కాగా, ఈ వారం ప్రారంభంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన ఓకాకు సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ అభినందన సభ ఏర్పాటు చేసింది. ఆ సభలో జస్టిస్ ఓకా మాట్లాడుతూ చివరి రోజున పని చేయకూడదనే సంప్రదాయంతో తాను ఏకీభవించనని సభా ముఖంగా ప్రకటించారు. "పదవీ విరమణ చేసే న్యాయమూర్తి చివరి రోజున పని చేయకూడదనే సుప్రీంకోర్టులో అనుసరించే ఒక సంప్రదాయాన్ని నేను ఆమోదించను. ఆ సంప్రదాయాన్ని వదిలించుకోవడానికి మనకు కొంత సమయం పడుతుంది, కానీ కనీసం చివరి రోజున నేను రెగ్యులర్ బెంచ్‌లో కూర్చుని కొన్ని తీర్పులు ప్రకటించడంలో నాకు సంతృప్తి ఉంది" అని ఆయన చెప్పారు. "పదవీ విరమణ" అనే పదాన్ని తాను ద్వేషిస్తున్నానని, జనవరి 2025 నుండి వీలైనన్ని ఎక్కువ కేసులు వినాలని నిర్ణయించుకున్నానని, అలాగే పనిచేశానని ఆయన అన్నారు.

## బెయిల్ వచ్చిందని ర్యాలీ చేశారు..

మొదటిపేజీ తరువాయి బైకులు, కార్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈలలు, కేకలు వేస్తూ గోల గోల చేశారు. వీరి నిర్వాకంపై ప్రజలంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..కర్నాటక హావేరి జిల్లా అక్కి ఆలూర్ పట్టణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రేప్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. దీంతో రేప్ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అఫ్తాబ్ చందనకట్టి, మదర్ సాబ్ మందక్కి, సమివుల్లా లలనావర్, మొహమ్మద్ సాదిక్ అగసిమణి, షోయిబ్ ముల్లా, తౌసిప్ చోటి, రియాజ్ సావికేరి జైలు నుంచి విడుదలయ్యారు. అయితే జైలు నుంచి బయటికి వచ్చిన వారు.. బైకులు, కార్లతో పట్టణంలో ర్యాలీ చేశారు. తామేదో గొప్ప పని చేసి బయటికి వచ్చినట్లుగా విజయం సంకేతాలు చూపుతూ, ఈలలు.. కేకలు వేస్తూ వెళ్లడాన్ని చూసి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అసలేం జరిగిందంటే..

కర్నాటక హావేరి జిల్లాలో 2014 జనవరి 8న మహిళపై గ్యాంప్ రేప్ జరిగింది. మైనారిటీ వర్గానికి చెందిన 26 ఏళ్ల మహిళ.. మరో మతానికి చెందిన 40 ఏళ్ల ఆర్టీసీ డ్రైవర్‌తో కలిసి హోటల్ గదిలో ఉంది. ఈ క్రమంలో పైపు రిపేరు పేరుతో గదిలోకి వచ్చిన ఏడుగురు దుండగులు ఆమెను బలవంతంగా కారులో వేరే ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. వేరే మతానికి చెందిన వ్యక్తితో ఉన్నాననే కోపంతోనే ఇలా చేశారని అప్పట్లో బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి మొత్తం 19 మందిని అరెస్ట్ చేశారు. కాగా, వీరిలో 7 మంది ప్రధాన నిందితులుగా తేల్చారు. వీరిలో 12 మందిని సుమారు 10 నెలల క్రితం బెయిల్‌పై విడుదల చేయగా.. మిగిలిన ఏడుగురు నిందితులకు ఇటీవల కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కాగా, విడుదలైన యువకుల ర్యాలీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

## ఆర్గానిక్ ఉత్పత్తులకు కొత్త ప్రపంచం..

మొదటిపేజీ తరువాయి ఈశాన్య రాష్ట్రాలకు బలమని ఆయన స్పష్టం చేశారు. భారతదేశమే ఒక వైవిధ్యభరితమైన దేశమని, అలాంటి దేశంలో ఈశాన్య రాష్ట్రాల ప్రాంతం అత్యంత వైవిధ్యభరితమైన భాగమని అభివర్ణించారు. శుక్రవారం న్యూఢిల్లీలో రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాల వైవిధ్యానికి వాణిజ్యం నుంచి సంప్రదాయం వరకు, వస్త్ర రంగం నుంచి పర్యాటకం వరకూ బలాన్ని ఇస్తుందన్నారు. టీ, వెదురు ఉత్పత్తులు, సహజ వాయువు, క్రీడలు, నైపుణ్యానికి ఈశాన్య రాష్ట్రాలు పర్యాయ పదమని చెప్పుకొచ్చారు. ఇక ఆర్గానిక్ ఉత్పత్తులకు సైతం ఈ రాష్ట్రాలు కొత్త ప్రపంచమని కీర్తించారు. అలాగే దేశానికి ఈశాన్య ప్రాంతం శక్తి కేంద్రమన్నారు. కానీ తమకు మాత్రం ఈ రాష్ట్రాలు అష్టలక్ష్ములతో సమానమని ఆయన అభివర్ణించారు. ఈస్ట్ అంటే దిశ మాత్రమే కాదని.. %జూూూ%.. అంటే ఎంపావర్ (సాధికారత), యాక్ట్ (చర్య), స్ట్రెంథెన్ (బలోపేతం), పరివర్తన ( ట్రాన్స్‌ఫారమ్) అంటూ ప్రధాని మోదీ వివరించారు. గతంలో ఈశాన్య రాష్ట్రమంటే.. సరిహద్దు ప్రాంతంగా మాత్రమే అంతా భావించేవారని గుర్తు చేశారు. కానీ ఆయా రాష్ట్రాలు నేడు అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్నాయన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు.. పర్యాటక రంగాన్ని ఆకర్షణీయంగా చేస్తాయన్నారు. అంతేకాకుండా అవి పెట్టుబడిదారులకు మరింత విశ్వాసాన్ని అందిస్తాయని చెప్పారు. ఈశాన్యంలో తాము మౌలిక సదుపాయాల విప్లవాన్ని ప్రారంభించామని.. అది ప్రస్తుతం అవకాశాల భూమిగా మారుతోందని చెప్పారు. ఈశాన్యంలో అనుసంధానత మరింత బలపడుతోందని ఈ సందర్భంగా ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలోని సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈశాన్య ప్రాంతం పాత్ర బలపడుతోందన్నారు. దేశాభివృద్ధిలో ఈశాన్య రాష్ట్రాల ప్రాముఖ్యతను ప్రధాని మోదీ ఈ సందర్భంగా సోదాహరణగా వివరించారు. ఈశాన్య ప్రాంతంలోని ప్రతి రాష్ట్రం పెట్టుబడులకే కాదు.. నాయకత్వానికీ సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తుందన్నారు. వికసిత్ భారత్‌లో భాగంగా తూర్పు భారతదేశం ప్రాముఖ్యతను ప్రధాని మోదీ వివరించారు.

## బెట్టింగ్ యాప్‌లపై 'సుప్రీం'లో కేఏ పాల్ పిటిషన్..

మొదటిపేజీ తరువాయి జూదాన్ని ప్రోత్సహిస్తున్నారని.. యువత జీవితాలు నాశనమవుతున్నాయని పేర్కొన్నారు. 25 మందికి పైగా బాలీవుడ్, టాలీవుడ్ నటులతో పాటు ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇందులో పాల్గొన్నారని.. ఎఫ్ఐఆర్‌లు దాఖలైనట్లుగా పేర్కొన్నారు. యువతను బెట్టింగ్ యాప్స్ తప్పుదారి పటిస్తున్నాయన్న ఆయన.. వారిని ఆర్థికంగా, మానసికంగా నాశనం చేస్తున్నాయన్నారు. యాప్స్‌ని ప్రమోట్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. యాప్స్ కారణంగా యువతలో ఆర్థిక సమస్యలు, మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలు పెరిగాయని.. సమాజంలో జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వారి జీవించే హక్కును కోల్పోతున్నారని.. తాను ఇక్కడికి (కోర్టుకు) లక్షలాది మంది పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల తరఫున ఉన్నానన్నారు. పొగాకు ఉత్పత్తుల తరహాలోనే బెట్టింగ్ గురించి ఎలాంటి హెచ్చరికలు, అవగాహన లేదన్నారు. అయితే, సెలబ్రిటీలు బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేఏ పాల్ టీమిండియా దిగ్గజ క్రికెట్ సచిన్ టెండూల్కర్ పేరును ప్రస్తావించారు. 'క్రికెట్ దేవుడు ఆమోదిస్తే.. ప్రజలు ఇది సరైందేనని అనుకుంటారు' అని పేర్కొనగా.. జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. 'ఐపీఎల్ చూడడం పేరుతో బెట్టింగ్ జరుగుతోందని ఆయనకు తెలుసు.. అయితే కేంద్రం ఏం చేస్తుందో తాము అడుగుతాం' అని పేర్కొన్నారు. ఈ క్రమంలో కేంద్రానికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. పిటిషన్ సాఫ్ట్‌కాపీని అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌కు ఇవ్వాలని సూచించింది. అవసరమైతే రాష్ట్రాలకు కూడా తరువాత నోటీసులు జారీ చేయవచ్చని ధర్మాసనం పేర్కొంది.

## కరోనా కలకలం.. ఏపీలో మరో కేసు

మొదటిపేజీ తరువాయి కరోనా కేసు వెలుగులోకి రావడంతో జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నిన్న విశాఖలో ఓ మహిళకు కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఏపీలో ఇప్పటి వరకు రెండు కరోనా కేసులు నమోదు అయ్యాయి. విశాఖలో వివాహితకు కరోనా పాజిటివ్ అని తేలింది. మద్దెలపాలెంలోని పిఠాపురం కాలనీకి చెందిన 28 ఏళ్ల మహిళకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వివాహిత చలి జ్వరం, తీవ్రమైన దగ్గుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. వైద్య పరీక్షల్లో కోవిడ్ 19గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆరోగ్య శాఖ అధికారులు కేజీహెచ్‌లో మరోసారి శాంపిల్‌ను పరీక్షించగా అది కూడా పాజిటివ్ గానే నిర్ధారణ అయ్యింది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండగా వైద్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయగా హోం ఐసోలేషన్‌లో ఉంచారు. ఆ వెంటనే ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మద్దెలపాలెంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. వివాహిత కుటుంబ సభ్యులందరికీ కరోనా పరీక్షలు నిర్వహించేందుకు నమూనాలు సేకరించి కేజీహెచ్‌కు పంపించారు. వారందరూ కూడా హోం ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. కాగా.. ఇప్పటికే ఏపీ వైద్య ఆరోగ్య శాఖ కరోనాకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన ఆదేశాలిచ్చింది. గ్రూప్‌గా ఉన్న చోట తిరగవద్దు అంటూ పలు ఆదేశాలను ఈనెల 21నే వైద్య ఆరోగ్య శాఖ ఇచ్చింది. ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాస్కులు కచ్చితంగా వాడాలని పేర్కొంది. అలాగే చలి జ్వరం , దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి-వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాల నొప్పులు, బాడీ పెయిన్స్, ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. రైల్వేస్టేషన్లు , బస్టాండ్లు విమానాశ్రయాలు వంటి వాటిలో కోవిడ్ నిబంధనలు పాటించాలని ఏపీ ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది.

## తెలంగాణలో దంచికొడుతున్న వానలు..

మొదటిపేజీ తరువాయి కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని చెప్పింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. శనివారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వానలు కొనసాగుతాయని చెప్పింది. ఆదివారం నుంచి మంగళవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడుతాయని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఉత్తర తెలంగాణతో పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ 127.5 మిల్లీమీటర్లు, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో 124.3 మిల్లీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది.

## కేంద్రమంత్రి జితేంద్ర సింగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ..

మొదటిపేజీ తరువాయి కేంద్రం ఈ విప్లవాత్మక మార్పులను గుర్తించి, తగిన భాగస్వామ్యం కల్పిస్తుందనే ఆశాభావాన్ని ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు. అంతకుముందు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం కలిశారు. ఈ సమావేశంలో పోలవరం - బనకచెర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనను సమర్పించారు. గోదావరి వరద నీటిని ఏపీలోని కరువు పీడిత ప్రాంతాలకు మళ్లించడమే ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు లక్ష్యం. జల్ జీవన్, బ్లూ రివల్యూషన్, మేక్ ఇన్ ఇండియా వంటి జాతీయ మిషన్ల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత దిగువ రాష్ట్రంగా మిగులు జలాలపై ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న హక్కును కూడా ఈ సందర్భంగా సీఎం వెల్లడించారు. పోలవరం-బనకచెర్ల అనుసంధాన ప్రాజెక్టుకు సంబంధించిన వివరాల డీపీఆర్ త్వరలో సమర్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పనులను త్వరగా ముందుకు తీసుకెళ్లడానికి తక్షణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని సీఎం చంద్రబాబు అభ్యర్థించారు. కాగా.. శుక్రవారం ఉదయం కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీతో సీఎం సమావేశమై... ఏపీలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు సహకారంపై చర్చించారు. పీఎం సూర్యఘర్ యోజన కింద 20 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలకు సోలార్ రూఫ్ టాప్ కేటాయింపులు ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరారు. కేంద్రం సహకరిస్తే పునరుద్పాదన ఇంధన వినియోగంలో ఏపీ.. భవిష్యత్‌లో దేశానికి మార్గనిర్దేశం చేయగలదని అన్నారు. ఆపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయిన సీఎం చంద్రబాబు.. ఏపీలో వ్యూహాత్మక రక్షణ, ఏరో స్పేస్ ప్రాజెక్టులపై చర్చించారు

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక


# యోగాంధ్రలో ప్రజలు భాగస్వామ్యులు కావాలి

**– అంతర్జాతీయ యోగా దినోత్సవంను ఘనంగా నిర్వహించుకోవాలి.**

**– జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య**

మన గళం,కర్నూలు కలెక్టరేట్ : యోగాంధ్రలో ప్రజలు భాగస్వామ్యులు అయి అంతర్జాతీయ యోగా దినోత్సవం ను ఘనంగా నిర్వహించుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుండి రాజ్ విహార్ సెంటర్ వరకు నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్రలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 రోజున ప్రజలందరూ పాల్గొని ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు, ఇప్పటికే యోగాంధ్ర క్యాంపేయన్ ప్రారంభించుకోవడం జరిగిందని, అంతర్జాతీయ యోగా దినోత్సవం ఇంకా ఒక నెల ఉన్నదని, ఈ నెల రోజులు యోగ గురించి ప్రజలకు తెలియజేయవలసిన అవసరం ఉందని, జూన్ 21 వ తారీకున విశాఖపట్నంలో మెగా ఈవెంట్ జరుగుతుందని దీనికి కొనసాగింపుగా రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగా కార్యక్రమంలో పాల్గొనాలనే లక్ష్యంతో ఈ క్యాంపియన్ ను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఈనెల 24 మరియు 25 తేదీలలో మాస్టర్ ట్రైనర్స్ కి ఓరియంటేషన్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని, మాస్టర్ ట్రైనర్స్ మండల స్థాయిలో వారం రోజులు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని, ఈ యోగ ప్రోటోకాల్ ప్రకారం ట్రైనర్స్ కు ఐదు రోజులు, జనరల్ పబ్లిక్ కు 3 రోజులు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం యోగాసనాల పోటీలు నిర్వహించి గ్రామస్థాయిలో యోగా ను బాగా చేసిన వారికి మండల స్థాయిలో , మండల స్థాయిలో బాగా యోగ చేసిన వారికి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 21వ తారీఖున అంతర్జాతీయ




యోగా దినోత్సవం రోజున బాగా యోగా చేసిన వారికి బహుమతులు బహుకరించడం జరుగుతుందని అన్నారు. ప్రతిరోజు యోగా పై అవగాహన కల్పించుట కొరకు, ర్యాలీలు, మానవహారలు ఏదో ఒక ఈవెంట్ ద్వారా యోగా కార్యక్రమాన్ని ప్రోత్సహించడం కోసం ఒక నెల పాటు క్యాం పేయన్ జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కన్స్యూమర్ కోర్ట్ జడ్జి కిషోర్ గారు, డిఎస్ఓ రాజా





రఘువీర్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డిఎస్ డి ఓ భూపతి రావు, డిఏఓ డాక్టర్ శ్రీనివాసులు, ఆయుష్ డిపార్ట్మెంట్ డాక్టర్ కె వి ఎన్ ప్రసాద్, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, వినియోగదారుల సంఘాల అధ్యక్షులు శివ మోహన్ రెడ్డి, ఐఓసి సేల్స్ ఆఫీసర్ రామ్మోహన్, వివిధ కంపెనీల గ్యాస్ ఏజెన్సీ ల సిబ్బంది, రేషన్ షాప్ డీలర్లు, వివిధ కంపెనీల పెట్రోల్ బంక్ డీలర్లు మరియు వారి సిబ్బంది పౌరసరఫరాల శాఖ కార్యాలయం సిబ్బంది తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

# బీచ్ సెపక్ తక్రాలో రాష్ట్రానికి కాంస్య పతకం




మన గళం,కర్నూలు స్పోర్ట్స్ : కేంద్రపాలిత ప్రాంతమైన డ్యూ లో జరుగుతున్న ఖేలో ఇండియా బీచ్ పోటీలలో భాగంగా మహిళా సెపక్తక్రా డబుల్ ఈవెంట్లో ఆంధ్రప్రదేశ్ బాలికలు ప్రత్యర్థులపై వరసగా విజయాలు సాధించి కాంస్య పథకాన్ని సాధించడం జరిగిందని రాష్ట్ర సంఘం కార్యదర్శి జి శ్రీనివాసులు తెలిపారు తొలి రౌండులో డ్యూ గుజరాత్ పై 2–0 స్కోర్ తో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్ లోకి చేరుకున్నారు ఢిల్లీ మరియు ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగిన పోటీలో వరుసగా రెండు పాయింట్ల సాధించి 2–0 స్కోర్ తో ఢిల్లీ పై విజయం సాధిం సాధించి సెమీ ఫైనల్స్ చేరుకోవడం జరిగిందని తెలియజేశారు ఒరిస్సా జట్టుపై ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగిన సెమీ ఫైనల్స్ మహిళలు గట్టి పోటీనిచ్చి పరాజయం చెందారు. వీరు కాంస్య పథకాలు సాధించేందుకు ప్రోత్సహించిన శిక్షకులు బి శ్రీనివాసులు అలాగే విజయానికి ప్రధాన పాత్ర పోషించిన క్రీడాకారులకు రాష్ట్ర సతక్రా సంఘం ప్రతినిధుల తరపున శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలిపారు.

# వ్యాపారులకు సహకరిస్తాం

**– రాష్ట్ర మంత్రి టి.జి.భరత్**





మన గళం,కర్నూలు రాజవిహార్ : కర్నూలు నగరంలోని ఎస్టీబీసీ గ్రౌండ్ లో క్రెడాయ్ ప్రాపర్టీ అండ్ బిల్డ్ టెక్ షో ను రాష్ట్ర మంత్రి టీజీ. భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారికి ముందుగా క్రెడాయ్ ప్రాపర్టీ అండ్ బిల్డ్ టెక్ షో యాజమాన్యం పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అన్ని విధాల సహయసహకారాలు అందిస్తామన్నారు. ప్రజలకు మంచి సౌకర్యాలతో ప్లాట్లు, ఇంటి నిర్మాణాలు అందించాలని ఆయన కోరారు. ప్రాపర్టీ షోలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ ప్రాపర్టీ అండ్ బిల్డ్ టెక్ షో యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. మూడు రోజుల పాటు ఈకార్యక్రమం కొనసాగనుంది. ఈకార్యక్రమంలో కర్నూలు మేయర్ బీవై. రామయ్య, కమీషనర్ రవీంద్ర బాబు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కేజే.రెడ్డి,గోరంట్ల రమణ, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్ వైరస్ పై హెచ్.ఓ.డి.లతో సమీక్ష



మన గళం,కర్నూలు వైద్యం : కోవిడ్ వైరస్ పై శుక్రవారం సమీక్షా సమావేశం జరిగింది. నగరంలోని స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల లో జరిగిన ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కోవిడ్ వైరస్ను ఎదుర్కోవడానికి అనుసరించాల్సిన ప్రోటోకాల్ లను వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కోవిడ్ కేసుల దృష్ట్యా ఆస్పత్రిలోని ఎదుర్కోవడానికి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో కోవిడ్ వైరస్ పై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పల్మోనాలజీ, అనస్థీషియా, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, ఎమర్జెన్సీ మెడిసిన్ మరియు మైక్రోబయాలజీ ఫ్యాకల్టీతో కూడిన రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు, రెడీ చేసుకోవాలని సంబంధించి హెచ్ ఓ డి లను ఆదేశించినట్లు తెలిపారు. పిపిఇ కిట్‌లకు సంబంధించి తగినంత స్టాక్ అందుబాటులో ఉన్నట్టు తెలియజేశారు.మాస్క్ పిపిఈ కిట్స్ మరియు అయాంటీ వైరల్ డ్రగ్స్, అత్యవసర ఔషధాలు అందుబాటు లో ఉండేలా సర్జికల్ అండ్ మెడికల్ స్టోర్ లకు ఆదేశాలు జారీ చేశారు. ఆక్సిజన్ పోర్ట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అనస్తీసియా వైద్యులకు ఆదేశించారు. ఆసుపత్రిలో ఇప్పటివరకు ఎలాంటి కోవిడ్ కేసులు నమోదు కాలేదని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డా.వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ హెచ్ ఓ డి, డా.ఇక్బాల్ హుస్సేన్, అనస్తీసియా హెచ్ ఓ డి, డా.విశాల, మైక్రో బయాలజీ ప్రొఫెసర్, డా.నాగలక్ష్మి, మైక్రో బయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, డా.విజయలక్ష్మి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, డా.శివబాల నగాంజన్, డా.కిరణ్ కుమార్, ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్, డా.సుబ్రహ్మణ్యం, డ్రగ్స్ స్టోర్ మెడికల్ ఆఫీసర్, డా.శారద, ఇతర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.హెచ్.ఎం.ఎగ్జిక్యూటివ్ కమిటీ సమీక్ష

మన గళం,కర్నూలు వైద్యం : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎన్.హెచ్.ఎం.ఎగ్జిక్యూటివ్ కమిటీ సమీక్ష జరిగింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎన్. హెచ్.ఎం. నేషనల్ హెల్త్ మిషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు టెలిమేడిసన్ ద్వారా ఆసుపత్రులలో ఉన్న ఎస్ ఎన్ సి యు లో పని చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది సంబంధించిన జీతాలకు సంబంధించి పీడియాట్రిక్స్ హెచ్‌ఓడి, సీఎస్ఆర్ఎంఓ పరిశీలించి వారి సేవలను ధృవీకరించిన తర్వాతనే డిఎంహెచ్ఓ గారికి బిల్ ప్రాసెస్ చేయాలన్నారు. ఆసుపత్రిలోని పీడియాట్రిక్ విభాగంలోని సేవలను మరింతగా మెరుగుపరుచుకోవాలని పీడియాట్రిక్ హెచ్ ఓ డి కి తెలిపారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు



మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమానికి సీఎస్ఆర్ఎంఓ డా.వెంకటేశ్వరరావు, పీడియాట్రిక్ హెచ్ ఓ డి డా. విజయ్ ఆనంద్ బాబు, పీడియాట్రిక్ వైద్యులు, డా.రవీంద్రనాథ్ రెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, డా.కిరణ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అసిస్టెంట్ వెహికల్ ఇన్ స్పెక్టర్ ,వాహన యజమాని మధ్య వాగ్వాదం

- కార్ బాయ్ నెట్ పై కూర్చుని వాహన యజమాని..నిరసన
- తాలుకా పి.ఎస్.లో...ఫిర్యాదు





మన గళం,ఆదోని : ఆదోని నియోజకవర్గ పరిధిలోని విరూపాపురం గ్రామంలో ఓ అరుదైన ఘటన చోటు చేసుకుంది. ఆ గ్రామ సమీపంలో కర్ణాటకకు చెందిన ప్రయాణికులు వాహనంలో ప్రయాణిస్తుండగా ఆదోని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ ఘటన ను కొందరు వీడియో తీయడంతో, ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. వెహికల్ ఇన్స్పెక్టర్ కే. ఎం .డి . ఆవైస్ కర్ణాటక ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి విరుపాపురం మార్గంలో వెళ్తూ ఉండగా వెహికల్ ధ్రువపత్రాలు చెక్ చేస్తామని, అధికారి వాహనాన్ని ఆపారు. అన్ని పత్రాలు సరిగా ఉండడంతో వెళ్ళమని అధికారి చెప్పగా, కర్ణాటక ప్రాంతానికి చెందిన వ్యక్తి మీరెవరు ? మీరు ఎందుకు మమ్మల్ని ఆపుతున్నారు ? అంటూ తమతో వాగ్వాదానికి దిగారాని, తాను ఆర్టీఏ అధికారినని చెప్పినా. సదరు ప్రయాణీకుడు వినకుండా తమను దుర్భాషలాడాడని, తమను ముందుకు వెళ్లకుండా, తమ కారుపై కూర్చొని ఇక్కడే ఉండాలని వితండవాదం చేశాడని, ఇదే విషయంపై ఆదోని తాలూకా పోలీస్ స్టేషన్లో సదరు ప్రయాణీకుడిపై ఫిర్యాదు చేశామని ఆర్టీఏ అధికారి స్పష్టం చేశారు.

# ఈతకు వెళ్లి ఇద్దరు చిన్నారులు మృతి





మన గళం : ఎమ్మిగనూరు కర్నూలు జిల్లా మండల కేంద్రమైన గోనెగండ్లలో ఇద్దరు చిన్నారులు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీకు తొట్టిలో మునిగిపోయి మధు ప్రియ (13) మంజుల (13) మృతి చెందారు. మల్లకల్, సరస్వతి లకు ముగ్గురు కూతుర్లు ఒక కుమారుడు రెండో కూతురు మధుప్రియ, రంగస్వామి మహేశ్వరిలకు ఇద్దరు కూతుర్లు ఒక కుమారుడు రెండో కూతురు మంజుల, సరస్వతి, మహేశ్వరి ఇద్దరు కూలి పనికి వెళ్లారు. వారితోపాటు వారి పిల్లలు మధుప్రియ, మంజుల పోలం కు వెళ్లారు. అక్కడ నీటి ట్యాంక్ ఉండటంతో పిల్లలు ఇద్దరు సరదాగా బ్యాంకులో ఈత కొట్టడానికి వెళ్లారు. ఆ ట్యాంకులో నీరు సుమారు ఆరడుగుల లోతు ఉండటంతో ఈతకు వెళ్లిన పిల్లలు, ప్రమాదవశాత్తు నీటి ట్యాంకులో మునిగిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. నీటి ట్యాంక్ దగ్గరకు వెళ్లిన మధుప్రియ, మంజుల బ్యాంకు నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన పిల్లల తల్లులు ట్యాంక్ దగ్గరికి వెళ్లి చూశారు. అప్పటికే పిల్లలు ట్యాంకులో మునిగి ఉండడం చూసి గట్టిగా కేకలు వేశారు. వెంటనే ఆ పొలం యజమాని ఆ చిన్నారులను బయటకు తీసి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మధుప్రియ, మంజుల మృతి చెందారని డాక్టర్లు తెలపడంతో మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతి చెందిన మధుప్రియ, మంజుల గృహాలు బీరప్ప గుడి ప్రాంతంలో ఒకే చోట ఉండటంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

# పీఎం శ్రీ క్రింద చేపట్టిన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయండి

- జూన్ 6వ తేది నాటికి పెండింగ్ పనులు పూర్తి కావాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మన గళం, నంద్యాల కలెక్టరేట్ : పిఎం (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం క్రింద జిల్లాలో 40 పాఠశాలల్లో నిర్మిస్తున్న రసాయన ప్రయోగశాల, ప్లే గ్రౌండ్స్, లైబ్రరీ, కిచెన్ గార్డెన్స్ తదితర నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకరావాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పిఎంశ్రీ స్కూల్స్ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) క్రింద చేపట్టిన నిర్మాణాలపై ఎంఈఓలు, ప్రధాన ఉపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఎపిసి ప్రేమాంత్ కుమార్, డిఈఓ జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో పీఎం శ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) క్రింద మొదటి విడత కింద 28 పాఠశాలలు, రెండో విడత కింద 12 పాఠశాలల్లో రసాయన ప్రయోగశాల, ప్లే గ్రౌండ్స్, లైబ్రరీ, ఆర్ఓ ప్లాంట్లు, కిచెన్ గార్డెన్స్ తదితర 144 పనులు మంజూరయ్యాయన్నారు. మొదటి విడతలో 28 పాఠశాలల్లో ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాలను తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించాలన్నారు. పెండింగ్లో ఉన్న నిర్మాణ పనులు జూన్ 6వ తేది నాటికి పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. పాఠశాలలో నిర్మించిన రసాయన ప్రయోగశాల గోడల మీద రసాయనాల పేర్లతో కూడిన పెయింటింగ్స్ వేయించాలన్నారు. అదే విధంగా ప్లే గ్రౌండ్స్ నిర్మించే సమయంలో చాలా జాగ్రత్తగా నిర్మాణాలను చేపట్టాలన్నారు. కిచెన్ గార్డెన్స్ కు సంబంధించి ఫెన్సింగ్ పూర్తయిందని విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఇందుకు హార్టికల్చర్ సిబ్బందిని వినియోగించు కోవాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనులపై జూన్ 6వ తేదీన పునః సమీక్షిస్తానని అప్పటిలోగా పనులన్నీ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. ర్యాంపు నిర్మాణాలకు మూడు రోజులు, వర్షపు నీటి నిల్వ కుంటలు, టాయిలెట్స్ ను వారం రోజుల్లో నిర్మించే అవకాశం ఉందని నాణ్యతలో రాజీ పడకుండా 15 రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కూడా స్కూల్ కమిటీ వారిని సమన్వయం చేసుకుంటూ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# బీసీల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



మన గళం,కర్నూలు సిటి : కర్నూలు గెస్ట్ హౌస్ కు విచ్చేసిన బీసీ వెల్ఫేర్ స్టేట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్. సత్యనారాయణను మర్యాదపూర్వకంగా తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వెంపెంట రాంబాబు కలిశారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ బీసీ భవనం నిర్మాణం త్వరగా చేపట్టాలని, అలాగే బీసీ స్టడీ సర్కిల్ కు హాస్టల్ మంజూరు చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ హాస్టల్ల కు సొంత భవనాలు నిర్మించాలని, వివిధ బీసీ కులాలకు సంబంధించిన కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు నంద్యాల కర్నూలు పట్టణాల్లో నిర్మించాలని కోరారు..అనంతరం బీసీ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ సత్యనారాయణ బీసీ భవన్ ను సందర్శించారు. ఈసందర్భంగా బీసీ సంఘం నాయకులు వేంపేట రాంబాబు ప్రిన్సిపల్ సెక్రెటరీని బీసీ భవన్ నిర్మాణం త్వరలో చేయబట్టాలని కోరారు. ఆయన స్పందించి త్వరలో నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసన్న, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుస్సేన్ బీసీ జిల్లా సెక్రెటరీ పీజీ వెంకటేశ్వర్లు, బీసీ యువ నాయకులు శివకుమార్, బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఏకకాలంలో 31 పనులకు శంకుస్థాపన

- రూ. 12.30 కోట్ల పనులను ప్రారంభించిన మంత్రి టి.జి భరత్



మన గళం,కర్నూలు నగరపాలక సంస్థ : కర్నూలు నగరంలోని పలు వార్డుల్లో రూ. 12.30 కోట్ల పనులకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ శంకుస్థాపన చేశారు. ముందుగా నగరంలోని అశోక్ నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద సిసి రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. అనంతరం 13, 46, 42, 13, 51, 1, 3, 8, 14, 14, 15, 16, 24, 23, 22, 25 వార్డుల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపనలు చేశారు. హైదరాబాద్ నుండి వచ్చే వాహనాలు ఎస్ఏపీ క్యాంపు మీదుగా కొత్త బస్టాండ్ వైపు వచ్చేందుకు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రాష్ట్ర మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ నగరవాసులకు ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు వార్డుల్లో పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. వీటన్నింటినీ కల్పించేందుకు తాను కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వైజాగ్ తరహాలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఉండేలా పనిచేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఇటీవలె కాంట్రాక్టర్లతో చర్చించి వారి సమస్యలు కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. తాను శంకుస్థాపన చేసిన ప్రతి ఒక్క అభివృద్ధి నాణ్యతతో నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించానన్నారు. అశోక్ నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద వర్షం పడితే నీరు నిల్వ ఉండి రాకపోకలకు ఎంతో ఇబ్బంది కలుగుతోందన్నారు. ఎన్నో ఏళ్ల నుండి ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గడిచిన ప్రభుత్వంలో విధ్వంసం జరిగిందని.. దీన్ని సెట్ చేసుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్ను రూ.2700 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇక ఓర్వకల్లు నుండి విజయవాడకు విమానసౌకర్యం కల్పించేందుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు ఇండిగో కంపెనీతో మాట్లాడినట్లు తెలిపారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులో భవిష్యత్తులో ఎన్నో పరిశ్రమలు వస్తాయన్నారు. 14 వేల కోట్లతో సెమీ కండక్టర్ల కంపెనీ, ఎలక్ట్రానిక్ వెహికల్స్ తయారీ కంపెనీ రాబోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాజధానికి కచ్చితంగా విమాన సౌకర్యం ఉండాలన్న ఉద్దేశంతో ఇందుకోసం తీవ్రంగా కృషి చేశానన్నారు. రానున్న రోజుల్లో కర్నూలు-విజయవాడకు విమాన సర్వీసు ప్రతిరోజూ నడిపేలా కృషి చేస్తామన్నారు. దీంతో పాటు రెండు పైలట్ ట్రైనింగ్ సెంటర్లు కూడా వచ్చాయన్నారు. ఇండియాలో పైలట్లు తక్కువ సంఖ్యలో ఉన్నారని.. ఈ రంగంలో రాణించేందుకు యువత ముందుకు రావాలని ఆయన కోరారు. అనంతపురం నుండి కర్నూలు వరకు మెగా ఇండస్ట్రియల్ కారిడార్ చేసేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. రాయలసీమ రానున్న రోజుల్లో ఎంతో అభివృద్ధి చెందబోతుందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యస్.రవీంద్ర బాబు, కార్పొరేటర్లు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

గ్రీన్‌గ్యాస్‌కు గ్లోబల్ ట్యాక్స్...

గ్లోబల్ వార్మింగ్ కట్టడికోసం గ్రీన్‌హౌస్ ఉద్గారాల (హరిత వాయువుల వెల్లువ)పై గ్లోబల్ ట్యాక్స్ విధించడానికి షిప్పింగ్ వనరుగా ఉన్న ప్రధాన దేశాలు అంగీకారం తెలిపాయి. దీని ప్రకారం నౌకలు విడుదల చేసే ప్రతి టన్ను కార్బన్ డైయాక్సైడ్‌పై ఇకనుంచి కనీసం 100 డాలర్ల వంతున పన్ను విధించనున్నాయి. ఆయా దేశాల నౌకలు లక్ష్యాలను చేరలేకపోయినా, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ నెట్ జీరో ఫండ్‌కు నిధులు అందించకున్నా 2028 నుంచి ఈ ట్యాక్స్‌ను వసూలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 11న లండన్‌లో 60కి పైగా దేశాల ప్రతినిధులతో ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ (ఐఎంఒ) సమావేశం జరిగింది. అయితే అగ్రరాజ్యం అమెరికా మాత్రం దీనికి గైర్హాజరు కావడం గమనార్హం. ఓడల్లో వాడే ఇంధనానికి సైతం ఈ సమావేశం పలు ప్రమాణాలను నిర్దేశించింది. మొత్తం ఉద్గారాల్లో షిప్పింగ్ వాటా 3 శాతమని ఐక్యరాజ్యసమితి గణాంకాలు చెబుతున్నాయి. ఓడల సంఖ్యతోపాటు వాటి పరిమాణం పెరుగుతుండడం, అందుకు అనుగుణంగా ఇంధనవాడకం విపరీతంగా పెరిగిపోతుండటంతో రానున్న రోజుల్లో షిప్పింగ్ ఉద్గారాలు ఇంకా ఎక్కువవుతాయని భావిస్తున్నారు. ఐఎంఒ భేటీలో కుదిరిన ఒప్పందంపై సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగెజ్ హర్షం వెలిబుచ్చారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి షిప్పింగ్ ఆధునికీకరణకు ఎన్నో సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ ఈ బృందం అర్థవంతమైన ఏకాభిప్రాయాన్ని సాధించిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ వాణిజ్యానికి సముద్ర నౌకా రవాణా అన్నది వెన్నుముక వంటిది. ఏటా సుమారు 12 బిలియన్ టన్నుల సరకు నౌకలపై రవాణా అవుతుందని యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యుఎన్‌సిటిఎడి) 2023 నివేదిక వెల్లడిస్తోంది. 2022లో సముద్ర వాణిజ్యం 0.4 శాతం తగ్గినా, కంటైనర్ల ద్వారా రవాణా (2024 నుంచి కంటైనర్ల రవాణా ఏటా 3% పెరుగుతోంది) చమురు, గ్యాస్ రవాణా 2022 నుంచి క్రమంగా 6%, 4.6 శాతం పెరుగుతుండడంతో 2028 నాటికి మొత్తం సముద్ర వాణిజ్యం 2.1% నుంచి 2.2% వరకు పెరుగుతుందని అంచనా. ఈ విధమైన పెరుగుదల ఇంధన వాడకానికి మరింత ఆజ్యం పోస్తుంది. గత దశాబ్దకాలంగా షిప్పింగ్ ఉద్గారాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఏటా విడుదలయ్యే ఒక బిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్‌డైయాక్సైడ్ ఉద్గారాలు, 3% గ్లోబల్ గ్రీన్‌హౌస్ గ్యాస్‌తో సమానం. భారీ నౌకలు ప్రతి ట్రిప్పుకు ఎక్కువ సరకును రవాణా చేస్తుంటాయి. భారీ మొత్తంలో ఇంధనాన్ని మండిస్తుంటాయి. పనామా, లిబేరియా, మార్షల్ దీవుల్లో ఇదే పరిస్థితి. ప్రపంచం మొత్తం మీద రవాణా అయ్యే టన్నుల సరకుల్లో మూడోవంతు ఈ రేవుల ద్వారానే జరుగుతుంది. అంతే సమానంగా ఉద్గారాలు విడుదల అవుతుంటాయి. ఇంటర్నేషనల్ మారటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఒ) 2023 సవరించిన గ్రీన్‌హౌస్ గ్యాస్ (జిహెచ్‌జి)వ్యూహం (స్ట్రాటెజీ) ఆశించే లక్ష్యాలను నిర్దేశించింది. 2008 నాటి ఉద్గారాలస్థాయిలను ప్రామాణికంగా తీసుకుని 2030 నాటికి 20% నుంచి 30% వరకు ఉద్గారాలు తగ్గించాలని, 2050 నాటికి జీరో స్థాయికి చేరుకోవాలని నిర్దేశించింది.

అయిననప్పటికీ, ఎలాంటి చొరవ తీసుకోకుంటే ఉద్గారాలు మరింత ఎక్కువగా పెరుగుతాయని అంచనా వేశారు. యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ గుర్తించడం బట్టి భౌగోళిక రాజకీయ మార్పులు, ఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాలు, మళ్లీ చమురు, ఆహార ధాన్యాల నౌకల రవాణా టన్నుల భారం కన్నా మరింత దూరం సాగేలా చేస్తున్నాయి. 2023లో చమురు రవాణా దూరంతోపాటు సుదీర్ఘకాలం సాగింది. ఐఎంఒ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ నిర్ణయించిన గ్లోబల్ కార్బన్ టాక్స్ మేరకు ఆయా లక్ష్యాల నౌకలు నెట్ జీరో నిధులను అందించడం కానీ, లేదా ఉద్గారాల నియంత్రణ కానీ చేయలేకపోతున్నాయని వ్యాఖ్యానించింది. ఇది వాడుతున్న ఇంధన ప్రమాణాల బట్టి ఆధారపడి ఉంది. ఉద్గారాలను పూర్తిగా, లేదా కొంత స్థాయివరకు తగ్గించడానికి దోహదపడే హైడ్రోజన్, మెథనాల్, అమెనియా వంటి వాటిని ప్రోత్సహించడం అవసరం. ప్రకృతికి విరుద్ధమైన మానవ కార్యకలాపాల వల్ల భూమి వేడెక్కిపోతూనే ఉంది. 1850లో భూ ఉష్ణోగ్రతను నమోదు చేయడం మొదలైనప్పటి నుంచి అత్యుష్ణ సంవత్సరంగా 2023 రికార్డు సృష్టించగా, వెంటనే 2024 ఆ రికార్డును బద్దలు కొట్టింది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఒ) గత జనవరిలో ఈమేరకు ఓ నివేదిక విడుదల చేసింది.

అసలు గడచిన పదేళ్లు భూమిపై గత 125000 ఏళ్లలోనే అత్యుష్ణ సంవత్సరాలని ఐరోపా, బ్రిటన్, జపాన్ దేశాల వాతావరణ సంస్థలు నిర్ధారించాయి. బొగ్గు, చమురు ఆధారిత పారిశ్రామిక విప్లవం వచ్చినప్పటి నుంచి భూ ఉష్ణోగ్రత పెరుగుతూ వస్తోంది. ఈ పెరుగుదల 1.5 సెల్సియస్ డిగ్రీలకు (2.7 ఫారన్ హీట్) మించకుండా చూడాలని 2015లో పారిస్ వాతావరణ సభ తీర్మానించింది. కానీ ఈ ఏడాది భూ ఉష్ణోగ్రత ఆ పరిమితిని మించి 1.6 సెల్సియస్ డిగ్రీలకు పెరిగిందని ఐరోపా కమిషన్‌కు చెందిన కొపెర్నికస్ వాతావరణ విభాగం తెలిపింది. జపాన్ ఈ పెరుగుదలను 1.57 డిగ్రీలుగా, బ్రిటన్ 1.53 డిగ్రీలుగా లెక్కగట్టాయి. వాతావరణ మార్పుల వల్ల వరదలు, తుపానులు, అనావృష్టి తలెత్తి గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 14,000 కోట్ల డాలర్ల నష్టం జరిగింది. శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజ వాయువులను మండించడం వల్లనే వాతావరణంలో కర్బనం పెరిగి ఉష్ణోగ్రతను పెంచుతోంది. పారిశ్రామిక విప్లవంనుంచి సంపన్న ఐరోపా, అమెరికా ఖండ దేశాలు శిలాజ ఇంధనాలను మండించడం ద్వారా ప్రపంచానికి 170 లక్షల కోట్ల డాలర్ల నష్టం కలిగించాయి. ఈ నష్టాలను అధిగమించడానికి వర్ధమాన దేశాలకు లక్షల కోట్ల డాలర్ల సహాయం చేయాల్సిన సంపన్న దేశాలు కేవలం 30,000 కోట్ల డాలర్లను అదీ 2035 కల్లా విదిలిస్తామని ప్రతిపాదించాయి. భూగోళం వేడెక్కడ మనేది కఠోరమైన వాస్తవమని డబ్లుఎంఒ తాజా నివేదిక మరోసారి రుజువు చేస్తోందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. భూతాపం పెరగడం మాతాశిశు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తోంది. వేడి ఎక్కువగా ఉండే రోజుల సంఖ్య పెరుగుతున్నందున నెలలు నిండక ముందే శిశు జననాలు సంభవిస్తున్నాయి. తల్లులకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. 202024 మధ్య కాలంలో 247 దేశాలు, 940 నగరాల్లో అధిక వేడిరోజులు రెట్టింపు అయ్యాయని తేల్చారు. గడిచిన అయిదేళ్లలో భారత్‌లో గర్భిణులకు ప్రమాదకరమైన రీతిలో జాతీయ స్థాయిలో ఏటా సగటున ఆరు అదనపు అత్యుష్ణ రోజులు నమోదైనట్టు నివేదికలు చెబుతున్నాయి.

## కోవెలకుంట్ల పట్టణంలో మంత్రి బిసి జనార్దన్ రెడ్డి సుడిగాలి పర్యటన

- కోవెలకుంట్లలో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన మంత్రి
- రూ. 2 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశం
- వారం రోజుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించి.. వచ్చే 3 నెలల్లో పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశం
- సంతపేటలోని ఉచిత మినరల్ ప్లాంట్ నిర్వహణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి
- స్వయంగా వాటర్ ప్లాంట్ లో నీటిని తాగి స్వచ్ఛతను పరిశీలించిన మంత్రి
- సాయంత్రంలోపు వాటర్ ప్లాంట్ ను శుభ్రం చేసి ఫోటోలు తనకు పంపాలని మంత్రి ఆదేశం



మన గళం,కోవెలకుంట్ల : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిచారించాలని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం బనగానపల్లె నియోజకవర్గం కోవెలకుంట్ల పట్టణంలో స్థానిక ఎంపీడీవో, ఇతర అధికారులతో కలిసి మంత్రి విస్తృతంగా పర్యటించారు.. గ్రామీణ నీటి సరఫరా, గ్రామీణ అభివృద్ధి, గ్రామ పంచాయతీ, సచివాలయం సిబ్బందిని వెంటబెట్టుకుని కోవెలకుంట్ల పట్టణం వ్యాప్తంగా పలు వీధుల్లో మంత్రి కలియతిరిగారు.. ఈ పర్యటనలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్యంగా కోవెలకుంట్ల పట్టణంలోని అధ్వానంగా ఉన్న డ్రైనేజి కాలువలను నేడు మంత్రి పరిశీలించారు.. మురుగునీటి నిల్వకు ఆస్కారం లేకుండా సక్రమంగా డ్రైనేజీ సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. సాయినగర్, ముదిగేడు రోడ్ నుండి వెటర్నరీ హాస్పిటల్, %హదీ×% కాలనీ నుండి సంతపేట, మరియు అమ్మవారిశాల వరకు సుమారుగా రూ. 2 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. వారం రోజుల లోపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించి, 3 నెలల లోపు పూర్తిచేసే విధంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని మంత్రి సూచించారు. సంతపేటలోని మినరల్ ప్లాంట్ నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి : సంతపేటలోని ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.. వాటర్ ప్లాంట్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం, ప్లాంట్ లోపల భాగాలు తుప్పు పట్టడం, వాటర్ ప్లాంట్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం చూసి మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. అనంతరం వాటర్ ప్లాంట్ లో నీటిని స్వయంగా త్రాగి.. మంచి నీటి స్వచ్ఛతను పరిశీలించడం జరిగింది.. ఇలాంటి నీరు ప్రజలు ఎలా త్రాగుతారని అధికారులపై మండిపడ్డారు. గ్రామ పంచాయతీ నిధులతో నిర్వహిస్తున్న సదరు వాటర్ ప్లాంట్ అపరిశుభ్రంగా ఉండటంపై సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈరోజు సాయంత్రం లోపు వాటర్ ప్లాంట్ రూమ్ ను శుభ్రం చేసి తనకు ఫోటోలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు.. ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణను మెరుగుపరుచుకుని.. ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు.

## వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నంద్యాలలో మానవహారం హ్యూమన్ చైన్




మనగళం, నంద్యాల :స్థానిక క్రాంతి రేఖా గ్రంథాలయంలో నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాది ఆధ్వర్యంలో జరిగిన ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంలో గౌరవ అధ్యక్షులు ఎస్.ఎండి.అబులైస్, ఎస్ అబ్దుల్ సమద్ , కో కన్వీనర్ మస్తాన్, ఎస్ డి పి ఐ ఎజాజ్, ఏ ఐ ఎం ఐ ఎం అయూబ్, మౌలానా ఇద్రీస్, జుబైర్ బాష, హనీఫ్ ,అబ్దుల్ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం - 2025 కు వ్యతిరేకంగా "ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు" వారి ఆదేశాల మేరకు "నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ" మరియు "మజ్లిసుల్ ఉలేమా వల్ ఐమ్మ" ఆధ్వర్యంలో ఈ నెల 25 వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుండి 2.30 గంటల వరకు మానవహారం ( ఇన్సాని జంజీర్, హ్యూమన్ చైన్) ను శాంతియుతంగా నిశ్శబ్దంగా మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఒకరి చేతులు ఒకరు పట్టుకోవడం ద్వారా నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో నంద్యాలలో గల అన్ని మసీదుల ఇమాములు, ఉలేమాలు, మసీదు పెద్దలు, రాజకీయ నాయకులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు పాల్గొని దీన్ని విజయవంతం చేయాలని కోరారు. మానవహారం నిర్మించే ప్రదేశాలను తెలుపుతూ తాము ఒక రూట్ మ్యాప్ ను అన్ని మసీదులకు పంపించామని, కావున మసీదు లోని మరియు ఆ ప్రాంత, యువత మరియు కార్యకర్తలు దీన్ని అనుసరించి ఆ రోజున తమ మహిళలు మరియు కుటుంబ సభ్యులతో సహా మానవహారంలో తప్పక పాల్గొని, కేంద్ర ప్రభుత్వం ముస్లిం ప్రజల అధిష్టానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన నల్ల చట్టాలను నిరసించాలని అన్నారు.

## యోగా ద్వారా అనారోగ్య సమస్యల నుండి బయటపడవచ్చు

మనగళం, నంద్యాల : 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మే 21 నుండి జూన్ 21 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పీ చంద్రబాబు ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో యోగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ చంద్రబాబు మాట్లాడుతూ క్రమం తప్పకుండా తీసుకునే ఆహారం లాగానే యోగాను కూడా మన దినచర్యలో భాగంగా చేసుకోవాలి. మనిషి క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల చాలా ఉపయోగాలు ఉంటాయి. ప్రతి మనిషి రోజువారి ప్రణాళికలో యోగాను చేర్చుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రావని, చేసే పనులు చురుగ్గా చేయగలరు. ప్రతి ఒక్కరూ యోగాను జీవన విధానంగా అలవర్చుకోవాలి.ప్రతి మనిషి జీవనశైలిలో ఒత్తిడి లు వంటివి ఉండవనన్నారు.



ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీతో పాటు తాలూకా ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య, రిజర్వు ఇన్స్పెక్టర్లు మంజునాథ్ ,మరియు స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహ కార్యక్రమాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కాటసాని

మన గళం,పాణ్యం : శుక్రవారం కర్నూలు ,పాణ్యం నియోజకవర్గం పరిధిలో జరిగిన పలు వివాహ మహోత్సవ కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరయ్యారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ....



# ప్రజా పంపిణీ వ్యవస్థను ఎండియు వాహనాల ద్వారానే పంపిణీ చేయాలి

**– సిఐటియు డిమాండ్**



మనగళం, నంద్యాల :ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు 9 రకాల నిత్యవసర సరుకుల ను మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ ద్వారానే ప్రజలకు పంపిణీ చేయాలని సిఐటియు నంద్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం నుండి సాయిబాబా నగర్, టెక్కె, పద్మావతి నగర్, మున్సిపల్ కార్యాలయం, బొమ్మల సత్రం మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ఎండియు వాహనాలతో భారీ ర్యాలీ చేపట్టి అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ గారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్ కె మహమ్మద్ గౌస్ జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు,ఎండియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖాజా శ్రీనివాసులు తోపాటు ఎండియు ఆపరేటర్లు, అసిస్టెంట్ ఆపరేటర్లు వందమందికి పైగా పాల్గొనడం జరిగింది. అనంతరం సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్,కే మహమ్మద్ గౌస్ జిల్లా ఉపాధ్యక్షులు తోట మధ్దులు, ఎండియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖాజా శ్రీనివాసులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హాయంలో వాహనాలను బ్యాంకుల నుండి ప్రతినెల ఈఎంఐ చెల్లిస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రజల ఇంటి దగ్గరికి తీసుకువెళ్తూ ప్రభుత్వం ఏ సరుకులు ఇచ్చిన ప్రజలకు అందించడంలో ఎండిఓ ఆపరేటర్ల సేవలు మెరుగైనవని అటువంటి ఎండియూ ఆపరేటర్లను అర్ధాంతరంగా జూన్ 1 నుండి తొలగిస్తున్నామని చెప్పడం చాలా దురదృష్టకరమని రాష్ట్రంలో ఎండియూ ఆపరేటర్లు 9260 మంది ఉన్నారని వీరికి అసిస్టెంట్లుగా 9260 మంది కార్మికులు ఉన్నారని కూటమి ప్రభుత్వం క్యాబినెట్లో తీసుకున్న నిర్ణయం వలన దాదాపు 20 వేల మంది కుటుంబాలు రోడ్డున పడ్డాయని వీరి మీద ఆధారపడిన 80000 మంది కుటుంబీకులు చాలా ఇబ్బందులు పడుతారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి ఎవరిని తొలగించాలి ఏ వ్యవస్థను నాశనం చేయాలని ఆలోచన చేస్తుంది తప్ప గత ప్రభుత్వ ఆయాయంలో జరిగిన తప్పులను సవరణ చేసి మరింత పటిష్టంగా చేసే ఆలోచన చేయడం లేదని ఇప్పటికే మూడు లక్షల మంది వాలంటీర్లను మద్యం దుకాణాల్లో పనిచేసే 30 వేల మంది కి పైగా ఉద్యోగులను ఇంటికి సాగనంపిందని అన్నారు అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలను విడిపించే విధానాలను కొనసాగిస్తుందని అన్నారు గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు తప్పులుంటే సవరణ చేయాలి లేదా తప్పు చేసి ఉంటే ఏ విధంగా సవరించాలి ప్రజలకు ఏ విధంగా మేలు చేయాలని ఆలోచన చేయాలి తప్ప గత ప్రభుత్వం తప్పు చేసింది అందుకే తొలగిస్తున్నామని చెప్పడం కార్మికులను ప్రజలను మోసం పుచ్చడమేనని సీఎం చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పౌరసర అపరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎండియు వాహనాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో ఆలోచన చేయకుండా ఇంటికి సాగనంపడం కూటమి ప్రభుత్వ నిరంకుశ విధానానికి నిదర్శనమని కార్మికుల రోడ్డున పడేసే కూటమి ప్రభుత్వ విధానాలను సిఐటియుగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఇప్పటికైనా రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఎండియు వాహనాలను కొనసాగించాలని, గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని మరింత కొనసాగింపుగా చేసే విధంగా చర్యలు చేపట్టాలని, లేకపోతే ఎండిఓ వాహన ఆపరేటర్లతో, అసిస్టెంట్లతో, వారి కుటుంబాలతో చలో విజయవాడ కైనా సిద్ధపడతామని కూటమి ప్రభుత్వాన్ని ప్రజల ముందు దోషిగా నిలబెడతామని సిఐటియుగా హెచ్చరించారు.

# గోల్డ్ లవర్స్ ఇక కొనేసేయండి.. బంగారం ధర తగ్గిందోచ్..?

మన గళం, గోల్డ్ ధరలు భారీగా పెరుగుతూపోగా.. నిన్న అనగా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. మరి హైదరాబాద్‌లో ఇవాల్టి బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే.. ఆ ధరలు ఇప్పుడు ఈ స్టోరీలో ఇప్పుడు తెలుసుకుందామా. గోల్డ్ లవర్స్ ఇది వినండి.. గత కొద్దిరోజులుగా బంగారం ధరలు దోబూచులాడుతున్నాయ్. కొద్దిరోజులు బంగారం ధరలు భారీగా పెరుగుతూపోతుంటే.. మరికొద్ది రోజులు తగ్గుముఖం పడుతున్నాయి. వరుసగా రెండు రోజులు రూ. 2650 మేరకు స్వచ్ఛమైన బంగారం ధర.. నిన్న(గురువారం) స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 350 మేరకు తగ్గితే.. 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ. 380 మేరకు తగ్గింది. అటు వెండి ధరలు కూడా బంగారం బాటలోనే పయణిస్తున్నాయి. సిల్వర్ రేట్లు భారీగా తగ్గాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 97,530గా ఉండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 89,400గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 89,400గా ఉండగా.. 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 97,530గా ఉంది. అటు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 97,530గా ఉండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 89,400గా ఉంది. బంగారం బాటలోనే వెండి ధరలు భారీగా తగ్గాయి. గత రెండు రోజులుగా సుమారు రూ. 4 వేల మేరకు పెరిగిన వెండి ధర.. నిన్న(గురువారం) రూ. 1000 మేరకు తగ్గింది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా నగరాల్లో కేజీ వెండి ధర రూ. లక్ష ఉండగా.. చెన్నై, హైదరబాద్, కేరళ, విజయవాడ, విశాఖపట్నంలో కిలో వెండి రూ. 1,11,000గా ఉంది.

# ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు

**– మంత్రి టి.జి.భరత్ కు ధన్యవాదాలు**

**– రాష్ట్ర వాల్మీకీ కార్పొరేషన్ డైరెక్టర్,46 వ వార్డు ఇంఛార్జ్ సంజీవ లక్ష్మి**



మన గళం,కర్నూలు సిటి : ఎన్నికల ముందు నేత టి.జి.భరత్ తానిచ్చిన హామీ నిలబెట్టుకున్నారని తెదేపా 46వ వార్డు ఇంఛార్జ్,రాష్ట్ర వాల్మీకీ కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవ లక్ష్మి అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని పలు వార్డుల్లో జరిగిన శంకుస్థాపన కార్యక్రమాలకు మంత్రి టి.జి.భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 46 వ వార్డులో డ్రైనేజీ,రహదారులు,తదితర సమస్యల పరిష్కారానికిరూ.1.12 కోట్ల నిధులతో పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలో అండర్ బ్రిడ్జి వద్ద చిన్న వర్షానికే నీరు నిలిచి, సమస్యలు తలెత్తేవని, అయితే వాటి పరిష్కారానికి మంత్రి భరత్ తగిన చర్యలు చేపడుతున్నారన్నారు.

# వన్ స్టాప్ సెంటర్ ద్వారా మెరుగైన సేవలు అందజేయండి

**–జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మన గళం,నంద్యాల కలెక్టరేట్ : వన్ స్టాప్ సెంటర్ ద్వారా హింసకు గురైన మహిళలకు సహాయ సహకారాలు అందించడంలో మెరుగైన సేవలు అందజేయాలని వన్ స్టాప్ సెంటర్ సిబ్బందిని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మిషన్ శక్తి సమీకృత మహిళా సాధికారత కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో ఇంచార్జి ఐసిడిఎస్ పిడి తేజేశ్వరి, డిఈఓ జనార్ధన్ రెడ్డి, ఐటిడిఎ పిఓ వెంకట శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వన్ స్టాప్ సెంటర్ ద్వారా అవసరం ఉన్న మహిళలకు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. వన్ స్టాప్ సెంటర్ ను 2024వ సంవత్సరం ఆగస్టు 1వ తేది జిల్లాలో ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు 32 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. కేసుల వివరాలను పూర్తి స్థాయిలో డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. అదే విధంగా వన్ స్టాప్ సెంటర్ లో ఆశ్రయం పొందిన మహిళలు కౌన్సిలింగ్ పొందిన అనంతరం సంబందిత స్వస్థలాల్లో వారు ఏ పరిస్థితిలో ఉన్నారన్న విషయాన్ని ఎప్పటికపుడు విచారిస్తూ ఉండాలని వన్ స్టాప్ సెంటర్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ లో కూడా మహిళలు అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లతో పాటు వన్ స్టాప్ సెంటర్ చిరునామా, సిసిఏ నెంబర్లు కూడా ఏర్పాటు చేసేలా చూడాలని వన్ స్టాప్ సెంటర్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా పిల్లల్లో విద్యార్థి దశ నుండే పోక్సో కేసులపై అవగాహన కల్పించడం ద్వారా కొంత మేరకు కేసుల తగ్గే అవకాశం ఉంటుందన్నారు. బాల్య వివాహాలను నియంత్రించడానికి పెళ్లిల సమయంలో వివాహ వేదిక బుక్ చేసుకునే సమయంలో వధువు, వరుడి పుట్టిన తేదీలను పరిశీలించాలన్నారు. అదే విధంగా వన్ స్టాప్ సెంటర్ లో సైకో సోషల్ కౌన్సిలర్ పోస్టును భర్తీ చేసేలా ఫైల్ ప్రాసెస్ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలో స్వీయ రక్షణ కోర్సులను జూన్ లో ప్రారంభించి సెప్టెంబరు నాటికి పూర్తి చేయాలన్నారు. విద్యార్థినిలు, మహిళలు కూడా అందరీ చరవాణిలో తప్పనిసరిగా శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, శక్తి టీమ్ ద్వారా అన్ని పాఠశాలలు, కళాశాల లోని విద్యార్థినలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కమిటీ సమావేశంలో యువజన సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ జుబేదాబేగం, జిల్లా ఖజానా శాఖ అధికారి లక్ష్మీదేవి, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహానాడును విజయవంతం చేసిన జిల్లా తెలుగుదేశం నేతలకు కృతజ్ఞతలు

**– కర్నూలు జిల్లా తెదేపా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి**

మన గళం,కర్నూలు సిటి : తెలుగుదేశంపార్టీ అధినేత ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు , పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శినారా లోకేష్ ల ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా మహానాడు తేది 22.05.2025న నిర్వహించడం జిరిగిందని, ఈ మహానాడు గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఎంతో ఉత్సాహంగా హాజరై విజయవంతం చేశారని కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్నూలు జిల్లా మహానాడుకు కర్నూలు జిల్లా పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గములు మరియు పాణ్యం పరిధిలోని 16 వార్డులు, కోడుమూరు పరిధిలోని 3 వార్డుల కర్నూలు నాయకులు కార్యకర్తలు మరియు అభిమానులు హాజరు కావడం జరిగిందని, అదే విధంగా ఎం. ఎల్. ఏలు, ఇన్చార్జీలు మరియు కర్నూలు పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రివర్యులు, మాజి ఎం.ఎల్.ఏలు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు వారి అనుచరులు తెలుగుదేశంపార్టీ మరియు పార్టీ అనుబంధ కమిటీల నాయకులు, కార్యకర్తలు మండల కమిటీల నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్, కుటుంబ సాధికార కమిటీ సభ్యులు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేసినందులకు వారికి ఒక్కొకరికి పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మహనాడు కార్యక్రమం గురించి ఎప్పటికప్పుడు పత్రికల ద్వారా ఎలెక్ట్రానిక్ మీడియా సోషల్ మీడియా ద్వారా తెలియజేస్తూ కార్యక్రమం విజయవంతంలో ప్రత్యేక శ్రద్ధ కనపరిచిన ప్రతినిధులకు కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ తరపున హృదయపూర్వకంగా ధన్యవాదములు తెలియజేస్తూ, రానున్న రోజులలో ఇదే సహకారాన్ని అందించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆలాగే ఈ మహనాడు కా విజయవంతానికి తోడ్పాటు అందించిన వారంతా కడపలో జరిగే రాష్ట్ర మహానాడు కార్యక్రమమునకు హాజరై కర్నూలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొనిరావల్సిందిగా ఆయన కోరారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# నేర నివారణే ప్రథమ కర్తవ్యంగా బాగా పని చేయాలి

- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్
- విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు.
- పెండింగ్ కేసులు తగ్గించాలి .
- రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి భాధ్యత.
- సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి.
- పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ... జిల్లా ఎస్పీ.





మన గళం,కర్నూలు క్రైం : విధులలో పోలీసులు అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ సంధర్బంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైల తో కర్నూలు జిల్లా ఎస్పీవిక్రాంత్ పాటిల్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులతో మాట్లాడారు. కర్నూలు , పత్తికొండ , ఆదోని , ఎమ్మిగనూరు సబ్ డివిజన్ లో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి జిల్లా ఎస్పీ గారు సమీక్షించి ఆరా తీశారు. పోలీసుస్టేషన్ల వారీగా కేసుల పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. డాభాల్లో మద్యం, ఒపెన్ డ్రింకింగ్, పేకాట వంటి అసాంఘిక కార్యకలపాల పై గట్టి చర్యలు చేపట్టాలన్నారు. అసాంఘిక కార్యకలపాలను ప్రోత్సహిస్తే ఎస్పీ గారి స్పెషల్ టీమ్స్ రంగంలోకి దిగి దాడులు చేస్తాయన్నారు. పెండింగ్ కేసులు తగ్గించాలన్నారు. మెజిస్ట్రేట్ లను కలిసి పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసులలో ముద్దాయిల అరెస్టు గురించి ఆరా తీశారు. ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా భాదితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల దర్యాప్తుల పై డిస్పీ స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా హైవే పెట్రోలింగ్ పోలీసులు బాగా పని చేయాలన్నారు. పోలీసు అధికారులు గ్రామాల పర్యటనకు వెళ్ళినప్పుడు రోడ్డు ప్రమాదాల మలుపులు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రేడియం స్టిక్కర్స్, బారికేడ్స్, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఒక్కరి ప్రాణం కాపాడినా వారి కుటుంబాన్ని కాపాడటమేనన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఓటిపి ఫ్రాడ్స్ పలు రకాల సైబర్ మోసాలతో ప్రతి రోజు కు రాష్ట్ర వ్యాప్తంగా కోటి రూపాయల వరకు ప్రజలు సైబర్ నేరాల బారిన పడి నష్టపోతున్నారన్నారు. డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. మిస్సింగ్ కేసులను చేధించాలన్నారు.

అనంతరం గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ గారు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ నేర సమీక్షా సమావేశంలో డిఎస్పీలు బాబు ప్రసాద్, ఉపేంద్రబాబు , హేమలత , ఏ ఆర్ డి ఎస్ పి భాస్కర్ రావు , సిఐలు , ఎస్సైలు పాల్గొన్నారు.

# నికర ఎఫ్డిఐల్లో 96 శాతం పతనం




మన గళం, విదేశీ పెట్టుబడులకు భారత్ ఆశజనకంగా కానరావడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థలో బలహీనతలు డిమాండ్‌ను సన్నగిల్లేలా చేస్తోంది. ఈ నేపథ్యంలోనే గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏకంగా 96 శాతం పతనమై 353 మిలియన్ డాలర్లకు పడిపోయాయని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించింది. విదేశీ కంపెనీల ఇక్కడి పెట్టుబడుల నుంచి భారత కంపెనీలకు చెందిన విదేశాల్లోని పెట్టుబడులను తీసేస్తే.. మిగిలేది నికర ఎఫ్‌డిఐలుగా పరిగణిస్తారు. కరోనా కాలం 2020-21లోనూ ఏకంగా 44 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. తదుపరి ఏడాది 38.6 బిలియన్లు, 2022-23లో 28 బిలియన్ డాలర్లు, 2023-24లో 10.1 బిలియన్లుగా చివరగా 2024-25లో కేవలం 0.4 బిలియన్లు (353 మిలియన్లు) ఎఫ్‌డిఐలు నమోదయ్యాయి. 2024-25లో స్థూల పెట్టుబడులు 81 బిలియన్లుగా, ఇంతక్రితం ఏడాది 71.3 బిలియన్లుగా, 2022-23లో 71.4 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. అత్యధిక పెట్టుబడులు సింగపూర్, అమెరికా, యుఎఇ, మారిషాస్, నెథర్లాండ్ దేశాల నుంచి అధిక ఎఫ్‌డిఐలు వచ్చాయి. 2024-25లో భారత కంపెనీలు విదేశాల్లో 29.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాయి. ఇంతక్రితం ఏడాది పెట్టుబడులతో పోల్చితే 75 శాతం పెరుగుదల నమోదయ్యింది.

# జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం పూర్తిగా అరికట్టేందుకు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలి

**-జూన్ ఒకటవ తేదీ నుండి 26 వ తేదీ వరకు కార్యక్రమాల నిర్వహణ -జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా**






మన గళం,కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం పూర్తిగా అరికట్టేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శు క్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నషా ముక్త్ భారత్ అభియాన్ అమలుపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వము నషా ముక్తభారత్ అభియాన్ పథకం ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 13 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల పిల్లలు మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు అధ్యయనాల్లో తేలినందున, పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలలో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు జరగాలని కలెక్టర్ తెలిపారు. బస్టాండ్ లు, రైల్వే స్టేషన్ లలోనూ రాత్రి సమయాల్లో పార్కులు , ఓపెన్ ప్లేసెస్ , ఫ్లై ఓవర్ల లాంటి ప్రదేశాలలో కూడా ఉంటారని, వారిపై గట్టిగా నిఘా పెట్టి వారిని రిహాబిలిటేషన్ సెంటర్ లకు తరలించి చికిత్స అందించే విధంగ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. మత్తు పదార్థాలను వినియోగించే వారిని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో ప్రత్యేక వార్డులో ఉంచి వారికి, మంచి వైద్య సౌకర్యాలు, కౌన్సిలింగ్ చేసి వారిని తిరిగి మత్తుపదార్థాల వైపు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని జి జి హెచ్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు. మత్తు పదార్థాలు వాడుతున్న వారికి వాటి నుండి విముక్తి పొందే చర్యల్లో భాగంగా యోగా , ఫుట్ బాల్, వాలీబాల్ క్రీడలలో పోటీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా డిఎస్ డి ఓను ఆదేశించారు. జూన్ 1 వ తేదీ 7 వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలలో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని, ఇందులో ఎన్ ఎస్ ఎస్ , స్కౌట్స్ , ఎన్ సిసి , యూనివర్సిటీ, కాలేజీ విద్యార్థులు కూడా పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే వర్క్ షాప్ లు కూడా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జూన్ 8వ తేదీ నుండి జూన్ 14 వ తేదీ వరకు వాల్ పెయింటింగ్స్, పోస్టర్లు తయారు చేయించి యూనివర్సిటీలు, కాలేజీలు, స్కూళ్లలో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ జిల్లా విద్యా శాఖాధికారిని ఆదేశించారు. జూన్ 15 వ తేదీ నుండి జూన్ 21 వ తేదీ వరకు చర్చలు , కాంపిటీషన్స్, సెమినార్లు, వెబ్ నార్ లు నిర్వహించాలని ఆర్ఐఓ , డి వి ఈ ఓ ను ఆదేశించారు. జూన్ 22వ తేదీ నుండి జూన్ 26 తేదీ వరకుకర్నూలు మున్సిపల్ కమిషనర్ ,కమ్యూనిటీ మెంబర్స్ , స్వచ్ఛంద సంస్థల ద్వారా అవగాహన ర్యాలీలు, సంతకాల సేకరణ, బైక్ ర్యాలీలు తదితర కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జూన్ 26 వ తారీకున ప్రతి కార్యాలయంలో, ప్రతి స్కూల్, కాలేజీ యూనివర్సిటీలో మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఏడి డిజేబుల్డ్ రయీస్ ఫాతిమా, లీగల్ సెల్ అడ్వకేట్ హేమలత, మెప్మా పీడీ నాగ శివలీల ,జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ ఓ డాక్టర్ శాంతి కళ ,ఐ సి డి ఎస్ పి డి నిర్మల, డిఇఓ శామ్యూల్ పాల్, డిఎస్పి బాబు ప్రసాద్, హాస్పిటల్స్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసులు, డి ఆర్ డి ఎ పి డి రమణారెడ్డి ,ఏపిడి శ్రీధర్, డి వి ఈ ఓ సురేష్ బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..

మన గళం

దిన పత్రిక

క్రీడా

శనివారం

24 - 05 - 2025



# ఆర్‌సీబీ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్..



మన గళం, ఐపీఎల్ ప్లే-ఆఫ్‌లకు అందుబాటులో లేకపోవడంతో ఇంగ్లాండ్ బ్యాట్స్‌మన్ జాకబ్ బెథెల్ స్థానంలో న్యూజిలాండ్ ఆటగాడు టిమ్ సీఫెర్ట్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గురువారం జట్టులోకి తీసుకుంది. అదనంగా, జట్టు కెప్టెన్ రజత్ పూర్తిగా ఫిట్‌గా ఉన్నారని కోచ్ అధికారికంగా ప్రకటించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 ఇప్పుడు ప్లేఆఫ్ దశ వైపు కదులుతోంది. లీగ్‌లో ఇంకా 7 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. కానీ నాలుగు ప్లేఆఫ్ జట్లు ఇప్పటికే ప్లేఆఫ్‌కు అర్హత సాధించాయి. ఈ సంవత్సరం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ టాప్ 4 జట్లు. కానీ, ప్లేఆఫ్‌లు దగ్గర పడుతున్న తరుణంలో, బెంగళూరుకు రెండు శుభవార్తలు అందాయి. ఐపీఎల్ ప్లేఆఫ్‌లకు అందుబాటులో లేని ఇంగ్లాండ్ బ్యాట్స్‌మన్ జాకబ్ బెథెల్ స్థానంలో న్యూజిలాండ్‌కు చెందిన టిమ్ సీఫెర్ట్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గురువారం ఎంపిక చేసింది. అంతేకాకుండా, జట్టు కెప్టెన్ రజత్ పటాధర్ పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడని, సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే ఈరోజు మ్యాచ్‌లో రజత్ కూడా మైదానంలో ఉండటం ఖాయం అని కోచ్ అధికారికంగా ప్రకటించాడు. రజత్ పాటిదార్ నాయకత్వంలో, ఆర్‌సీబీ ఇప్పటివరకు అద్భుతంగా రాణించింది. ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. అయితే, చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రజత్ వేలికి గాయమైంది. ఆ తరువాత, అతను పోటీలో పాల్గొనడంపై సందేహాలు ఉన్నాయి. కానీ, ఇప్పుడు జట్టు కోచ్ ఆండీ ఫ్లవర్ మాట్లాడుతూ రజత్ పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడని చెప్పుకొచ్చాడు. "ఐపీఎల్ విరామం గురించి మేం ఆందోళన చెందడం లేదు. జట్టు సీజన్ అంతటా కష్టపడి పనిచేసింది. ఇప్పటివరకు అద్భుతంగా ప్రదర్శన ఇచ్చింది. ఈ విరామం కొంతమంది ఆటగాళ్లకు ఫిట్‌గా ఉండటానికి అవకాశం ఇచ్చింది. మే 17న జరగాల్సిన ఆర్‌సిబి, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దు చేశారు. ఇది విరామాన్ని మరింత పొడిగించింది. ఇప్పుడు రజత్ పాటిదార్ బ్యాటింగ్‌కు ఫిట్‌గా ఉన్నాడు. ఇది మంచిది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ కూడా అనారోగ్యంతో ఉన్నాడు. కానీ, బ్రేక్ సమయంలో ఫిట్‌గా ఉండటానికి అవకాశం వచ్చింది. ఇప్పుడు వారు పూర్తిగా ఫ్రెష్‌గా ఉన్నారు. ఆడటానికి సిద్ధంగా ఉన్నారు" అని అతను చెప్పుకొచ్చాడు. ఆర్‌సీబీ ఇప్పుడు మిగిలిన అన్ని మ్యాచ్‌లను వారి సొంత మైదానానికి దూరంగా ఆడాలి. ఈ సవాలుకు జట్టు సిద్ధంగా ఉందని కోచ్ చెప్పుకొచ్చాడు. బెంగళూరులో వర్షం కారణంగా, సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ లక్నోలో జరుగుతోంది. బెంగళూరులో మ్యాచ్ ఆడకపోవడం మాకు నిరాశ కలిగించిందని ఆయన అన్నారు. "ఇతర మైదానాల్లో మా రికార్డు అద్భుతంగా ఉంది. హైదరాబాద్‌పై జట్టు బాగా ఆడుతుందని మేం ఆశిస్తున్నాం" అని తెలిపాడు.

# దుమారం రేపుతోన్న పంత్, గిల్ షేక్ హ్యాండ్ వ్యవహారం..



మన గళం, పంత్‌ను విస్మరించడంపై చాలా మంది వినియోగదారులు తీవ్రంగా కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఇది ఇద్దరు భారత సహచరుల మధ్య స్నేహపూర్వక పరిహాసమని సూచించారు. దీనిపై సోషల్ మీడియాలో తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి. సోషల్ మీడియాలో కొన్నిసార్లు చిన్న విషయాలు కూడా పెద్ద చర్చకు దారితీస్తాయి. భారత యువ క్రికెటర్, గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ విషయంలోనూ ఇలాంటిదే జరిగింది. గుజరాత్, లక్నో మ్యాచ్ అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌తో గిల్ కరచాలనం చేసిన తీరు పలువురు అభిమానులకు నచ్చలేదు. పంత్‌ను గిల్ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశాడని, ఇది అహంకారపూరిత చర్య అని కొందరు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. ఈ సంఘటనతో ఇంటర్నెట్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గురువారం అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 33 పరుగుల తేడాతో విజయం సాధించి, వరుసగా 4 నాలుగు మ్యాచ్‌ల ఓటములకు తెరదించింది లక్నో సూపర్ జెయింట్స్. లక్నో విజయానికి హీరోగా సెంచరీ హీరో మాచెల్ మార్ష్ నిలిచాడు. ఈ మ్యాచ్ మార్ష్, లక్నోకు బాగా కలిసొచ్చినప్పటికీ, మ్యాచ్ తర్వాత శుభ్‌మాన్ గిల్, రిషబ్ పంత్ మధ్య జరిగిన కొద్దిపాటి వాగ్వాదం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించింది. కొన్ని సెకన్ల పాటు కొనసాగిన జరిగిన ఈ సీన్‌లో.. గిల్ ఆచారం ప్రకారం కరచాలనం చేస్తున్న సమయంలో పంత్‌ను దాటి నడిచినట్లు కనిపించాడు. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ కొన్ని మాటలు మాట్లాడటానికి ఆసక్తిగా ఉన్నట్లు కనిపించాడు. గిల్ వేగంగా తదుపరి ఆటగాడి వైపు కదిలాడు. పంత్ తన వైపు తిరిగి చూడమని ప్రేరేపించాడని వీడియోలో తెలుస్తోంది. ఈ క్రమంలో పంత్‌ను విస్మరించడంపై చాలా మంది వినియోగదారులు తీవ్రంగా కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఇది ఇద్దరు భారత సహచరుల మధ్య స్నేహపూర్వక పరిహాసమని సూచించారు. దీనిపై సోషల్ మీడియాలో తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి. మ్యాచ్ విషయానికొస్తే, నిన్న మార్ష్ షోగా మిగిలిపోయింది. రషీద్ ఖాన్ బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో రెండు సిక్సర్లు, మూడు బౌండరీలతో 64 బంతుల్లో 117 పరుగులు చేసిన మార్ష్ లక్నోను 235/2కి చేర్చాడు. నికోలస్ పూరన్ 27 బంతుల్లో అజేయంగా 56 పరుగులు చేసి అండగా నిలిచాడు. సమాధానంగా, గుజరాత్ జట్టు ఛేదనలో చతికిలపడింది. అవేష్ ఖాన్ 4-6-6-4 గుజరాత్‌ను భయపెట్టాడు. ఈ క్రమంలో విల్ ఓ'రూర్కే (3/27) సాయి సుదర్శన్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, రాహుల్ తెవాటియా వికెట్లను పడగొట్టాడు. షారుఖ్ ఖాన్ 29 బంతుల్లో 57 పరుగులు చేయడం వృధాగా మారిపోయింది. ఈ క్రమంలో గుజరాత్ టార్గెట్ చేరుకోలేక 202/9కే పరిమితం అయింది. ఈ ఓటమితో, గుజరాత్ టాప్-2లో స్థానం సంపాదించే అవకాశాన్ని కోల్పోయింది. కానీ చెన్నైపై విజయంతో ఇంకా ఆ స్థానాన్ని సంపాదించుకోవచ్చు. ఇప్పటికే ప్లేఆఫ్ పోటీ నుంచి నిష్క్రమించిన లక్నో, సీజన్ చివరి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడటంతో, సీజన్‌ను గొప్ప విజయంతో ముగించాలని చూస్తుంది. గుజరాత్‌తో పాటు, ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్, బెంగళూరు తమ ప్లేఆఫ్ స్థానాలను ఖరారు చేసుకున్నాయి. దీంతో ప్లేఆఫ్ మ్యాచ్‌లు మరింత ఉత్కంఠగా మారనున్నాయి.

# లక్నో చేతిలో గుజరాత్ ఓటమి..



మన గళం,మే 22, గురువారం, నరేంద్ర మోడీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో లక్నో సూపర్ జెయింట్స్ తలపడింది. రిషబ్ పంత్ నేతృత్వంలోని జట్టు గుజరాత్‌ని 33 పరుగుల తేడాతో ఓడించింది. అయితే, గుజరాత్ ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించినందున ఈ మ్యాచ్ లక్నోకు కాస్త ఊరటనిచ్చేదిగా మారింది. కానీ ఓటమి శుభ్‌మాన్ గిల్ నేతృత్వంలోని జట్టును దెబ్బతీస్తుంది. ఎందుకంటే, పాయింట్ల పట్టికలో టాప్ 2లో కొనసాగే అవకాశాలను దెబ్బతీస్తుంది.ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్ 13 మ్యాచ్‌ల్లో 18 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్‌తో చివరి మ్యాచ్ మిగిలే ఉంది. అయితే, ఓటమి ఇతర జట్లకు, ముఖ్యంగా ముంబై ఇండియన్స్‌కు సానుకూల సంకేతంలా మారింది. టాప్ 2లో నిలిచే రేసులో గుజరాత్ 18 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఆర్‌సీబీ 12 మ్యాచ్‌ల్లో 17 పాయింట్లతో 2వ స్థానంలో ఉంది. అదే సమయంలో, పంజాబ్ 12 మ్యాచ్‌ల్లో 17 పాయింట్లతో 3వ స్థానంలో, ముంబై 13 మ్యాచ్‌ల్లో 16 పాయింట్లతో చివరి స్థానంలో ఉన్నాయి. ముఖ్యంగా, గుజరాత్ ఓటమితో, ముంబై ఇండియన్స్ పట్టికలో అగ్రస్థానంలో నిలిచే అవకాశం తెరుచుకుంటుంది. ముంబైకి ఒక మ్యాచ్ మాత్రమే మిగిలి ఉంది. గరిష్టంగా, ముంబై 18 పాయింట్లతో ముగించవచ్చు. ముంబై జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉండాలంటే, పంజాబ్ కింగ్స్‌తో జరిగే చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో గెలిచి 18 పాయింట్లను సాధించాల్సి ఉంటుంది. ఇంకా, హార్దిక్ పాండ్యా నేతృత్వంలోని జట్టు బెంగళూరు జట్టు తమ మిగిలిన రెండు మ్యాచ్‌లను ఓడిస్తే, చెన్నై తమ చివరి మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ఓడిస్తే.. అప్పుడు అగ్రస్థానంలో నిలుస్తుంది.

# అదరగొడుతున్న ముంబయి ఇండియన్స్

మన గళం, ఐపిఎల్ సీజన్ 2025 లో ముంబై ఇండియన్స్ అసాధారణ ఆటతో ప్లేఆఫ్ బె ర్త్‌ను సొంతం చేసుకుంది. తొలి నాలుగు మ్యాచుల్లో మూడింటిలో పరాజయం పాలైన ముంబై ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుంది. అందరి అంచనాలు తారుమారు చేస్తూ ఏకంగా ప్లేఆఫ్‌కు దూసుకెళ్లింది. ఆరంభ మ్యాచుల్లో ముంబై ఆటను చూసిన వారికి హా ర్దిక్ సేన ముందుకు వెళ్లడం కష్టమేనని అనిపించింది. వరుస ఓటములతో జట్టు డీలా పడిపోయింది. ఇ లాంటి స్థితిలో జట్టు పని అయిపోయిందని విశ్లేషకు లు సయితం అంచనాకు వచ్చారు. అయితే ముంబై మాత్రం ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ఒక్కో మ్యాచ్‌లో గెలుస్తూ మళ్లీ గాడిలో పడింది. హార్దిక్ పాం డ్య అద్భుత కెప్టెన్సీకి అనుభవజ్ఞులు రోహిత్ శర్మ, బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ సలహాలు, సూచనలు తోడు కావడంతో ముంబై మళ్లీ పూర్వం సంతరించుకుంది. వరుస విజయాలతో ప్రత్యర్థి జట్లను హ డలెత్తింది. వరుసగా ఐదు మ్యాచుల్లో గెలిచి పెను ప్ర కంపనలు సృష్టించింది. ముంబైని ఓడించేందుకు ఇత ర జట్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రోహిత్ శ ర్మ, రికెల్టన్‌లు దాదాపు ప్రతి మ్యాచ్‌లోనూ జట్టుకు శుభారంభం అందించారు. రోహిత్ ఫామ్‌లోకి రావ డం ముంబైకి కలిసి వచ్చిన అంశంగా మారింది. రో హిత్, సూర్యకుమార్



యాదవ్‌లు అద్భుత బ్యాటింగ్ తో జట్టుకు అండగా నిలిచారు. ఇద్దరు కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతూ జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించారు. రికెల్టన్ కూడా రోహిత్‌కు మంచి సహకారం అందించాడు. ఈ ముగ్గురు నిలకడగా ఆడడం తో ముంబై బ్యాటింగ్ పటిష్టంగా మారింది. వీరికి తో డు నమన్‌ధిర్, తిలక్‌వర్మ, కెప్టెన్ హార్దిక్ పాండ్య, విల్‌జాక్స్ తదితరులు కూడా తమతమ బ్యాట్‌లను ఝులిపిస్తూ జట్టును ఆదుకున్నారు.

# ఆత్మవిశ్వాసంతో హైదరాబాద్..

మన గళం, ఇప్పటికే ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ మిగిలిన రెండు మ్యాచుల్లోనూ గెలిచి పాయింట్ల పట్టికలో మెరుగైన స్థానంలో నిలవాలని భావిస్తోంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన కిందటి మ్యాచ్‌లో విజయం సాధించడం హైదరాబాద్‌కు కలిసి వచ్చే అంశంగా చెప్పాలి. బెంగళూరుతో జరిగే మ్యాచ్‌లో ఆత్మవిశ్వాసంతో దిగేందుకు ఈ గెలుపు దోహదం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. బెంగళూరు ఇప్పటికే నాకౌట్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. హైదరాబాద్‌పై కూడా గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోవాలని భావిస్తోంది. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండడంతో పోరు ఆసక్తికరంగా సాగడం ఖాయం. లక్నోతో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగిన యువ ఓపెనర్ అభిషేక్ శర్మపై అందరి కళ్లు నిలిచాయి. ఈ మ్యాచ్‌లో కూడా చెలరేగేందుకు సిద్ధమయ్యాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన అభిషేక్ చెలరేగితే సన్‌రైజర్స్‌కు ఎదురే ఉండదు. కిందటి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ కూడా మెరుగైన బ్యాటింగ్‌ను కనబరిచాడు. ఇది కూడా జట్టుకు కలిసి వచ్చే అంశంగా చెప్పాలి. ఇషాన్, అభిషేక్‌లు చెలరేగితే హైదరాబాద్‌కు భారీ స్కోరు ఖాయం. హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, కెప్టెన్ కమిన్స్ తదితరులతో హైదరాబాద్ బ్యాటింగ్ బలంగా ఉంది. లక్నో మ్యాచ్‌లో రిటైర్‌హర్ట్‌గా వెనుదిరిగిన ఆల్‌రౌండర్ కమిందు మెండిస్ ఈ మ్యాచ్‌లో ఆడతాడా లేదా అనేది చెప్పలేం. బౌలింగ్ కూడా హైదరాబాద్ బాగానే ఉంది. కిందటి మ్యాచ్‌లో ఇషాన్ మలింగ మెరుగైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈసారి కూడా సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. మరోవైపు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈ మ్యాచ్‌కు సమరోత్సాహంతో సిద్ధమైంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు సమతూకంగా ఉంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే బ్యాటర్లు, బౌలర్లకు జట్టులో కొదవలేదు. విరాట్ కోహ్లి, రజత్ పటిదార్, జితేశ్ శర్మ, ఫిల్ సాల్ట్, టిమ్ డేవిడ్ తదితరులతో జట్టు బలంగా ఉంది. ఈ మ్యాచ్‌లో కూడా గెలిచి రానున్న ప్లేఆఫ్ మ్యాచ్‌లకు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని బెంగళూరు భావిస్తోంది.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310